ప్రజల మాట ప్రగతి బాట

బెల్లంపల్లి నియోజకవర్గం

## పోలింగ్ స్టాఫ్‌కు అన్ని రకాల ఏర్పాట్లు చేయాలి

- ఎంపీవో సత్యనారాయణ
- బోయపల్లిలో పోలింగ్ బూత్‌ల పరిశీలన



పోలింగ్ బూత్ వద్ద కార్యదర్శికి సూచనలు చేస్తున్న ఎంపీవో సత్యనారాయణ

తాండూర్, అక్టోబర్ 25 : మండలంలోని అన్ని పోలింగ్ బూత్‌లలో పోలింగ్ స్టాఫ్‌నకు తగు ఏర్పాట్లు చేయాలని ఎంపీవో సత్యనారాయణ అన్నారు. బోయపల్లిలో పోలింగ్ బూత్‌లను బుధవారం ఆయన పరిశీలించి, కార్యదర్శికి పలు సూచనలు చేశారు. అన్ని పోలింగ్ బూత్‌లలో పోలింగ్ స్టాఫ్ రాత్రి బస చేసేందుకు ఏర్పాట్లు చేయాలని, మంచినీటి సౌకర్యం, టాయిలెట్స్ కరెంట్ ఫెసిలిటీ, అలాగే ఫ్యాన్ సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటరు ఓటు వేసేందుకు వచ్చిన సమయంలో నీడ ఉండేలా తప్పనిసరిగా ఆవరణలో టెంట్లు వేయించాలని సూచించారు. ఒకవేళ పెద్ద గ్రామాలై ఉండి, పోలింగ్ బూత్‌లు మూడు కంటే ఎక్కువ ఉన్నప్పుడు పంచాయతీ కార్యదర్శితో పాటు ఎంపీడబ్ల్యూలు గానీ ఎఫ్‌ఏలు, టీఏలను కూడా బాధ్యులుగా నియమించాలన్నారు. ఎక్కడి ఏర్పాట్లు అక్కడే చేసుకోవాలని తెలియజేశారు. మహిళా సిబ్బంది కూడా ఉంటారు కాబట్టి అందుకు సంబంధించి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, చూసుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉన్నదని తెలిపారు. మినిమం ఫెసిలిటీస్‌లో భాగంగా వచ్చిన ఓటర్లు, దివ్యాంగులకు ఇబ్బందుల్లేకుండా ర్యాంపులు సక్రమంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఇంటి పన్ను వసూలు ఈ నెలాఖరులోగా వసూలు చేసి, ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రమేశ్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం

బెల్లంపల్లి, అక్టోబర్ 25 : జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో బెల్లంపల్లి పట్టణంలోని కాంటా చౌరస్తా వద్ద బుధవారం అన్నదానం నిర్వహించారు. దాతలు మురుకూరి బాలాజీ, బాలకిషన్ సహకారంతో నిరుపేదలు, చిరువ్యాపారులు, యాచకులు, బాటసారులు, అనాథలకు భోజనం అందించారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీశ్, సభ్యులు నగేశ్, గురుస్వామి, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న జనహిత సేవా సమితి సభ్యులు

### ఉమ్మడి పాలకులు పట్టించుకోలే..



ఎప్పుడో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. ఉమ్మడి రాష్ట్రంలో వాటిని ఎవరూ పట్టించుకోలే. మా జీపీలో సర్పంచ్‌కు ప్రత్యేక గది కూడా లేదు. భవనమైతే చాలా ప్రమాదకరంగా మారింది. పాలకవర్గ సమావేశాలు నిర్వహించేందుకు ఇబ్బంది పడుతున్నాం. శిథిలావస్థకు చేరిన గ్రామ పంచాయతీ భవనాలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసి, పనులు ప్రాంభించడం హర్షణీయం.

**- చింతపురి దుర్గుబాయి, సర్పంచ్, రేచిని**

### చాలా సంతోషంగా ఉంది..



మా జీపీ భవనం చాలా పాతది. రికార్డుల నిర్వహణ, పాలకవర్గ సమావేశాలు ఏర్పాటు చేసుకునేందుకు ఈ భవనం సరిపోవడం లేదు. చిన్న భవనంతో మాకు ఎంతో ఇబ్బంది అవుతున్నది. కొత్త భవనం నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరుచేసి, పనులు ప్రారంభించడం సంతోషంగా ఉంది. ముఖ్యమంత్రి కేసీఆర్ సార్‌కు, ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యకు ప్రత్యేక కృతజ్ఞతలు. భవనం పూర్తయితే ఇన్నాళ్ల ఇబ్బందులు మొత్తం తీరిపోతాయి.

**- గజ్జెల బక్కమ్మ, సర్పంచ్, గోపాల్‌నగర్**

### ఇక సమస్యలుండయ్..



ఇరుకు గదిలో గ్రామపంచాయతీ కార్యాలయాన్ని నడిపిస్తున్నాం. దానినే సరిపెట్టుకొని వాటిలోనే కార్యాలయాన్ని నిర్వహించక తప్పడంలేదు. భవనం చిన్నగా ఉండడంతో పంచాయతీ రికార్డులు, ఇతర సామగ్రి, భద్రత, పాలకవర్గాల సమావేశాల నిర్వహణ సమస్యగా మారింది. వీటిని దృష్టిలో పెట్టుకొని కొత్త భవనాల నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయించడంతో ఈ సమస్యలన్నీ తీరనున్నాయి. అందుకు సహకరించిన ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యకు కృతజ్ఞతలు. **- ఏల్పుల రజిత, సర్పంచ్, కొత్తపల్లి**

# గ్రామాలకు కొత్త శోభ..

- తాండూర్ మండలంలోని 6 జీపీలకు నూతన భవనాలు
- పూర్తయిన శంకుస్థాపనలు
- ఇరుకు గదులు, చెట్లకింద సమావేశాలకు ఇక చెక్
- ప్రజాప్రతినిధులు, ప్రజల హర్షం



రేచిని జీపీలో కొనసాగుతున్న జీపీ భవన పనులు

తాండూర్, అక్టోబర్ 25 : చెట్ల కింద, రచ్చ బండల వద్ద, అద్దె భవనాలకు పరిమితమైన గ్రామ పంచాయతీల నిర్వహణ ఇక సొంత భవనాల్లోకి మారనున్నది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. తెలంగాణ ఏర్పాటు తర్వాత అనేక పల్లెలు, తండాలను జీపీలుగా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సర్పంచులు కార్యదర్శులు, సిబ్బంది కూర్చునేందుకు కూడా కనీస వసతులు లేని పంచాయతీల్లో ప్రభుత్వం పక్కా భవనాలు నిర్మించేందుకు పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసింది. తాండూర్ మండలంలో 6 గ్రామాల్లో పంచాయతీ భవనాలకు రూ.1.20 కోట్లు విడుదల చేసింది. ఇప్పటికే 3 గ్రామాల్లో నిర్మాణ పనులను ప్రారంభించగా, వివిధ స్టేజీల్లో ఉన్నాయి. 3 జీపీల్లో నిర్మాణాల కోసం బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆగస్టు 29న కొబ్బరికాయ కొట్టి, పనులను ప్రారంభించారు. ఈ మేరకు స్థానిక వీడీసీల ద్వారా పనులు చేపడుతున్నారు.

### మరింత మెరుగ్గా పాలన...

500 జనాభా ఉన్న ప్రతీ పల్లెను గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేశారు. ఆ పంచాయతీల నిర్వహణ కోసం పక్కా భవనాల ఆవశ్యకత ఏర్పడింది. ప్రస్తుతానికి ఇవి తాత్కాలిక భవనాల్లో కొనసాగుతున్నాయి. ముందుగా కొత్త పంచాయతీల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించిన రాష్ట్ర ప్రభుత్వం.. జీపీ భవనాలు లేని లోటును త్వరగా తీర్చాలని నిర్ణయించింది. ఉమ్మడి రాష్ట్రంలో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాలు సైతం కొన్ని శిథిలావస్థకు చేరుకొని ప్రమాదకరంగా తయారయ్యాయి. మండలంలో 50 ఏండ్ల కిందట నిర్మించిన అనేక భవనాలను పైపై మరమ్మతులతో సరిపెట్టి, వాటిలోనే కార్యాలయాలను నిర్వహించక తప్పడంలేదు. కొన్ని పంచాయతీలను అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నా రు. మరికొన్ని గ్రామాల్లో భవనాలు చిన్నగా ఉండడంతో పంచాయతీ రికార్డులు, ఇతర సామగ్రి భద్రత, పాలకవర్గాల సమావేశాల నిర్వహణ సమస్యగా మారింది. వీటిని దృష్టిలో పెట్టుకొని కొత్త భవనాల నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయించడంతో ఇకపై ఈ సమస్యలన్నీ తీరనున్నాయి. పంచాయతీల కు పక్కా భవనాల మంజూరుతో పల్లెపాలన మరింత మెరుగు పడనుందని ప్రజలు, సర్పంచులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

### ప్రజాప్రతినిధుల్లో హర్షం..

అసౌకర్యాల మధ్య కొనసాగుతున్న పంచాయతీలకు ప్రభుత్వం ఇటీవల నూతన భవనాలను మంజూరు చేయడంపై ఆయా గ్రామాల ప్రజాప్రతినిధుల్లో హర్షం వ్యక్తమవుతున్నది. మండలంలో 15జీపీలకు గాను 6 నూతన గ్రామ పంచాయతీ భవనాలను జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. బోయపల్లి, ద్వారకాపూర్, నీలాయిపల్లి, గోపాల్‌నగర్, కొత్తపల్లి, రేచిని గ్రామ పంచాయతీలకు నూతన కార్యాలయాల నిర్మాణానికి రూ.20 లక్షల చొప్పున ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. గతంలో పంచాయతీ కార్యాలయాల నిర్మాణానికి రూ.16 లక్షల చొప్పున మంజూరు చేయగా, ప్రస్తుతం నిర్మాణ సామగ్రి ధరలు పెరుగడంతో దాదాపు రూ.20 లక్షల వరకు వ్యయమవుతుందని అధికారులు అంచనా వేశారు. గ్రామపంచాయతీ తీర్మానం మేరకు భవనాలను నిర్మించనున్నారు.

### మార్గదర్శకాలు వచ్చాయి..



ప్రభుత్వం పంచాయతీలకు సొంత భవనాల నిర్మాణానికి గాను ఉత్తర్వులు జారీ చేసింది. వాటి నిర్మాణాలకు నిబంధనలు, మార్గదర్శకాలు వచ్చాయి. వాటి ద్వారా పూర్తి స్పష్టతతో పనులు నిర్వహిస్తాం. రూ.20లక్షల వ్యయంతో ఒక్కో భవనం నిర్మించాల్సి ఉంటుంది. ఈ అవకాషాన్ని సర్పంచ్‌లు సద్వినియోగం చేసుకుంటే పంచాయతీలకు శాశ్వత భవనాలు సమకూరుతాయి. ఇంతకుముందు రూ.16 లక్షలు వచ్చేవి. సామగ్రి ఖర్చు పెరగడంతో దానిని రూ.20 లక్షలకుపెంచారు.

**- ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో, తాండూర్**

### ఇబ్బందులు తొలుగుతయ్..



చాలాకాలంగా చిన్న గదుల్లో పంచాయతీ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నాం. అధికారులు వస్తే కూర్చునేందుకు అవకాశం కూడా లేకుండా ఉండేది. మా సమస్యలను మా ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య దృష్టికి తీసుకెళ్లాం. ఆయన వెంటనే స్పందించి, పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణానికి ఉత్తర్వులు జారీ చేశారు. చాలాసంతోషంగా ఉంది. సీఎం కేసీఆర్‌కు, ఎమ్మెల్యే చిన్నయ్యకు ప్రత్యేక కృతజ్ఞతలు. భవనం పూర్తయితే మా ఇబ్బందులున్నీ తీరుతయ్.

**- మాసాడి శారధ, సర్పంచ్, ద్వారకాపూర్**

### సౌకర్యాలతో భవనం నిర్మించుకుంటం..



గ్రామ పంచాయతీకి నూతన బిల్డింగ్ మంజూరు కావడం చాలా ఆనందంగా ఉంది. ఇక మీదట సమావేశాలకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది. మా జీపీ బిల్డింగ్‌తో పాటు మండలంలోని కొన్ని గ్రామాల జీపీ భవనాలకూ నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యకు కృతజ్ఞతలు. రూ.20 లక్షల నిధులతో అన్ని సౌకర్యాలతో కూడిన భవనాన్ని నిర్మించుకుంటాం. అన్ని రకాల ఏర్పాట్లు చేసుకుంటాం. నిధులను సద్వినియోగం చేసుకుంటం.

**- రేపాక సునీత, సర్పంచ్, నీలాయిపల్లి**

## పోలింగ్ బూత్‌లో ఏర్పాట్ల పరిశీలన

తాండూర్, అక్టోబర్ 25 : తాండూర్ మండలం కాసిపేటలోని పోలింగ్ బూత్‌లలో ఏర్పాట్లను బుధవారం ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. పోలింగ్ బూత్ నంబర్, బూత్ లెవెల్ ఆఫీసర్ పేరును పెయింటింగ్ వేయించాలని కార్యదర్శి, సిబ్బందిని ఆదేశించారు. పంచాయతీ పరిధిలో ఆప్ ఇన్‌స్పెక్షన్‌లో భాగంగా డంపింగ్ యార్డ్, నర్సరీలను పరిశీలించి, 2023–24కు గాను మొక్కల పెంపకం కోసం ఎర్రమట్టి, ఇసుక, ఎరువులను సమకూర్చుకొని బ్యాగు ఫిల్లింగ్ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. శానిటేషన్ పనులను పరిశీలించి, మురుగు కాలువల పూడికతీత, రోడ్లను శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. నూతనంగా చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులు, కాసిపేట స్కూల్ ప్రహరీ, కిచెన్ షెడ్ నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యదర్శి సాయితేజ, సిబ్బంది ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్